# ఆగమగీతి

— డా॥ ఆలూరి విజయలక్ష్మి



వైదేహి కళ్ళు వర్షిస్తున్నాయి. తనలోని సర్వ శక్తుల్నీ ఎవరో లాగేసుకున్నట్లుగా, జీవితంలో పోరాడడానికింక ఓపిక లేనట్లుగా పడుకునివుంది.

"శుక్రవారప్పూట నిండింట్లో ఎందుకా ఏడుపులు? ఆ అప్రాచ్యపుది మనకిక చచ్చిదానికిందే లెఖ్ఖ. దాని కోసం ఏడుస్తూ నువ్వు ముసుగెట్టుకుని పడుకుంటే యిక్కడ వండివార్చడానికి నీ బాబు పంపిన నౌఖర్లెవరూ లేరు." అత్తగారి కర్కశ కంఠం విని ఉలిక్కిపడింది వైదేహి. బ్రతికున్న తన కూతుర్ని చచ్చిన దానికిందే లెఖ్ఖ అని అత్తగారంటూంటే విలవిలలాడిపోయిందామె. తనపిల్లలు పెద్దవాళ్ళయి పెళ్ళీడుకొచ్చినా యింకా తన పుట్టింటి వాళ్ళ ప్రసక్తి తెచ్చి తన తల్లిదండ్రుల్ని తోబుట్టువుల్ని పేరుపేరునా తిట్టే ఆమె నోటికి జడిసి ఎదురు జవాబు చెప్పకుండా మంచం మీదనుండి పైకి లేచింది.

పడక కుర్చీలో కూర్చుని నిశ్చలంగా పేపరు చదువుకుంటున్న భర్త, శూన్యంలోకి చూస్తూ చుట్ట కాల్చుకుంటున్న మామగారు, మనవరాలేమయిపోయిందోననే దిగులు రవ్వంతైనా లేకుండా యింక జీవితంలో తిండి దొరుకుతుందో దొరకదోనన్నట్లు ఆబగా అన్నం తింటున్న అత్తగార్ని చూచి-గుండెల్లో కదలిక, హృదయంలో ఆర్ద్రతలేని యీ మనుషుల మధ్య తను పాతికేళ్ళుగా బ్రతుకుతూందనే వాస్తవం గుర్తుకొచ్చి దుఃఖం పొంగింది.

"ఏమిటలానుంచున్నావు అన్నం వడ్డించక?" భర్త అదిలింపుతో వైదేహి సహనం చచ్చిపోయింది.

"మీరసలు మనుషులేనా? ఈడొచ్చిన పిల్ల ఇల్లొదిలి పోతే ఏమయిపోయిందోనన్న ఆదుర్దా ఏమైనావుందా?... ఎప్పుడూ తిండి, తిండి, తిండి. ఏం? ఒక్కపూట తిండి లేకపోతే చచ్చిపోతారా?" నిప్పులు కక్కుతున్న వైదేహి వంక విస్తుపోయి చూచారు కాంతమ్మ, ఈశ్వర్రావు. తామెంత ఆరడి పెట్టినా అవమానించినా కిక్కురుమనకుండా ఇంటెడుపనీ చేసుకుని ఆఫీసుకు వెళ్ళే వైదేహేనా ఈమె అనుకున్నారు.

**అత్త మామలు, కట్టుకున్న భర్త బాధ్యతా రహితులై అమాయకురాలైన ఇల్లాలి పట్ల అమానుషంగా వ్యవహరిస్తూ వుంటే, ఆ 'సంప్రదాయానికి' బందీలైన వనితలు ఒక తరం! మమతానురాగాలకు చోటులేని కృత్రిమ సంప్రదాయపు సంకెళ్లలో మేమెందుకు నలిగిపోవాలని ప్రశ్నించేది ఈనాటి యువతరం. ఆ తరం వనితలు ఈ యువతరం పట్ల ఎలా వ్యవహరించాలి?**

"ఏమిటే ఆ వాగుడు? ఒళ్ళు పొగరెక్కి కులంగాని వెధవతో అది లేచిపోతే దానికి నువ్వేడుస్తూందిచాలక మమ్మల్నికూడా ఏడవమంటావా?" వైదేహి వాలకం చూచి ఒక మూల రవ్వంత జంకుగావున్నా బింకంగా కసిరాడు ఈశ్వర్రావు.

"మీరు మనుమలుకాదు, రాక్షసులు. కన్నబిడ్డన్న మమకారం కూడా లేకుండా నిజానిజాలు తెలుసుకోకుండా విషం కక్కుతున్నారు. అదేమైనా కానివని చేసివుంటే... అది మీ నిర్వాకం ఫలితమే. మీలో ఒక్కరంటే ఒక్కరు ఎప్పుడైనా పిల్లల్ని ప్రేమతో చేరదీసారా? ఏం తింటున్నారో, ఏం కట్టుకుంటున్నారో, ఏం చదువుతున్నారో ఒక్కనాడైనా అజ తీసుకున్నారా?...ఇదిగో, యిప్పుడే చెప్తున్నాను. ఇందూని ఎవరైనా వల్లెత్తి ఒక్కమాటన్నా రంటే ఊరుకోను" ఆవేశంగా అరిచింది వైదేహి.

"లోకమంతా కోడైకూస్తూంటే లేదుగాని మేమంటే అంత రోషమెందుకు?" సాగదీసింది కాంతమ్మ.

"ఏదీ ఎక్కడుందీ మీరు చెప్పేలోకం? యింటి భారాన్నిమొయ్యాల్సిన మగాడు తన జీతమంతా వ్యసనాలకు తగలేస్తూ ఇల్లు పట్టకుండా తిరగడమేకాక ఇంటిభారాన్ని తలెత్తుకున్న భార్యను చీటికి, మాటికీ తిట్టి, కొట్టి హింసిస్తూంటే అప్పుడెక్కడ నిద్రపోతూందీ లోకం? కన్నవారినొదిలి పెట్టి కళ్ళనిండా ఆశలునింపుకుని ఇంటికొచ్చిన ఆడపిల్లను, కళ్ళల్లో పెట్టుకుని చూడాల్సింది పోయి కాల్చుకు తింటూంటే మూగమొద్దులా ఎక్కడవుందీలోకం? వున్నదంతా మెక్కబట్టి నేను, నా బిడ్డలు రోజులు తరబడి పస్తులుంటూంటే ఏం చేస్తూందీ లోకం?" జరిగిపోయిన విషాద సంఘటనలన్నీ గుర్తుకొచ్చి ఆవేశం దుఃఖంగా మారి బావురుమంది వైదేహి. పెరట్లోకూర్చుని చదువుకుంటున్న హేమ, రమ మౌనంగా వింటున్నవారల్లా గబుక్కునవచ్చి తల్లిని పొదివి పట్టుకున్నారు.

"మీ అమ్మనేదో మేము కొట్టి చంపుతున్నట్లు వరుగెత్తుకొచ్చారేంటే తల్లుల్లారా?" మనవరాళ్ళమీద విరుచుకుపడింది కాంతమ్మ.

"కన్నీళ్ళ విలువ తెలియని యీ కసాయివాళ్ళ ముందు ఏడవడం అవమానకరమైన విషయమమ్మా! పద. వీళ్ళతో మాట్లాడడమూ, వీళ్ళదగ్గర ఏడవడమూ శుద్ధ వేస్ట్" తల్లి రెక్కపట్టుకుని లేవదీసి పెరట్లోకి తీసుకెళ్ళింది రమ. కాంతమ్మ రుసరుసల్నీ ఈశ్వర్రావు హుంకరింపుల్నీ వింటూ వాళ్ళవంక చీదరింపుగా చూచి తల్లిని అనుసరించింది హేమ.

ఇంతలో ముందు గదిలోంచి మాటలు వినిపించి అవాక్కయి కూర్చుంది వైదేహి. తమకు నాలుగిళ్ళవతల వుంటున్న సోమనాధం, ఆయనభార్య బుడిబుడిదీర్ఘాలు తీస్తూ ఏడుస్తున్న కాంతమ్మను, ఈశ్వర్రావును ఓదారుస్తూ తమకు తోచిన సలహాలివ్వడం విని వైదేహి గుండె జారిపోయింది. ఇప్పుడు ఇందూ గురించి తెలుసుకోవడం కంటే వీళ్ళు, వీళ్ళ తరువాత తామెలా ఏడుస్తున్నారో చోద్యం చూడడానికి వచ్చేవాళ్ళనుండి తమను తాము రక్షించుకోవడం తక్షణ సమస్య అయేలావుంది.

"అమ్మా! అక్క రఘువీర్ అనే హరిజన కుర్రాడితో లేచిపోయిందని అనుకుంటున్నారంతా. మనం కంగారుపడి వెదుక్కోవడంవల్ల మరీ అందరికీ తెలిసి అల్లరయిపోయింది. అసలేం జరిగిందో తెలుసుకోకుండా మా కాలేజ్‌లో అంతా వాళ్ళిష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారమ్మా!" విచారంగా చెప్పసాగింది హేమ.

"అమ్మా" వీధి వాకిట్లో నుండి సంభ్రమంగా పరుగెత్తు కొచ్చింది రమ. "అక్క ఎవరో కుర్రాడితో లెటరు పంపిందమ్మా" దుఃఖం, సంతోషం, కోపం ఒక్కసారిగా చుట్టుముట్టాయి వైదేహిని. వణికే చేతుల్తో ఉత్తరాన్ని తీసుకుని చదవసాగింది.

"అమ్మా!

'నన్ను క్షమించు' అని అడగను. ఎందుకంటే నాచర్యతో నేను నీకు కలిగించిన క్షోభ ఈ ఒక్కమాటతో తీరేదికాదని నాకు తెలుసు.

నేనే 'రఘువీర్' ని పెళ్ళి చేసుకున్నానమ్మా! ఇతని గురించి నీకు చెప్పాల్సిన అవసరం వస్తుందని ఊహించక యింతకు ముందు రఘువీర్ ఎవరో చెప్పలేదు నీకు. నేను హైస్కూల్లో చదువుతున్నప్పుడు కాలేజిలో చదివేవాడితను. అప్పటినుండి నేనంటే యిష్టాన్ని ప్రేమను పెంచుకున్నాడు. ఆ యిష్టాన్ని వెలిబుచ్చడానికి అతనెప్పుడూ సందేహించలేదు. అగ్రకులంలో పుట్టి, మనుమలకంటే వంశగౌరవాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు ఎక్కువని హోరు పెట్టే మనుమలమధ్య పెరిగిన నాకు అసలు హరిజనుడైన అతని గురించి, అతని ప్రేమ గురించి, దానికి నా ప్రతిస్పందన గురించి ఒకసారి ఆలోచించాలన్న భావమే రాలేదు. అదొక అసంభవమైన విషయంగా నిర్ణయించి ప్రక్కకు నెట్టేసాను. కాని...నా మౌనానికి, తిరస్కృతికి నిరాశ చెందకుండా తన యిష్టాన్ని నన్ను పెళ్ళి చేసుకోవాలనే ఆశను వ్యక్తపరుస్తూ జాబులు వ్రాస్తూనేవున్నాడు. తన చదువయిపోయి, ఉద్యోగస్తుడయాక నా అంగీకారం కోసం మరింత తరచుగా జాబులు వ్రాయసాగాడు.

నీ భారాన్ని తగ్గించాలని నువ్వు వద్దని వారిస్తున్నా వినకుండా చదువు మానేసి ఆ చిన్నజాబ్‌లో చేరిన నాకు నీకు సహాయ పడుతున్నానన్న సంతృప్తి ఎంతో కాలం నిలవలేదు. ఎదుగూబొదుగూలేకుండా, ఏ కొద్దిమార్పు లేకుండా, జీవితంలో ఏచిన్న సంతోషమూ లేకుండా ఎన్నాళ్ళిలా? అన్న ప్రశ్న నన్ను దొలిచేయ సాగింది. హేమ, రమల్ని అతికష్టంమీద చదివించగలుగుతున్నాం. వచ్చేసంవత్సరం ఉమకు కూడా హైస్కూలు చదువయిపోతుంది. రెండుపూటలా కడుపు నింపుకోవడానికే కష్టంగా వున్న మనకి వాళ్ళనింక చదివించడం సాధ్యపడుతుందా? ఒకవేళ ఎలాగోలా చదివించినా, ఆ చదువుతో మేము పొట్టపోసుకోగలమా? అటు ఉద్యోగాలు లేక, యిటు పెళ్ళికెదిగిన మేము నలుగురమూ యీ కట్నాల, కానుకల, వేధింపుల, ఆత్మహత్యల, హత్యల సమాజంలో మా ఉనికిని నిలుపుకోగలమా? సకుటుంబంగా దూకి మన నెత్తుటి మరకలతో మలినం చెయ్యడానికి, ఆ మరకల్ని చూచి సభ్యసమాజం ఒక్కసారి ఆగి ఆలోచించడానికి, సిగ్గుతో తల వంచుకోవడానికి మనఊళ్ళో చార్మినారైనా లేదే!!

అమ్మా! నా అంతరంగ మధనం నా ఆలోచనల్ని కూకటివేళ్ళతో కదిలించింది. యీ సమాజపువిలువల పట్ల నాకున్న అభిప్రాయాల్ని సమూలంగా మార్చేసింది. నాయనమ్మ గయ్యాళితనం, తాతగారి నిర్లిప్తత, నాన్న బాధ్యతారాహిత్యాలమధ్య, ప్రేమంటే ఏమిటో ఎరగకుండా నలిగిపోయిన నీ జీవితాన్ని చూచాక, ప్రేమ, అవగాహన పునాదిగా కాక డబ్బు పునాదిగా వ్యాపారంగామారిన వివాహవ్యవస్థకు ప్రతీకలుగా, అటువంటి వివాహవ్యవస్థ అవలక్షణాల్ని అనుభవిస్తున్న ఎంతోమంది దంపతుల్నిచూచాక, వివాహంపట్ల వైముఖ్యాన్ని పెంచుకున్నాను. నా వైముఖ్యాన్ని సడలించడానికి, 'సమాజంలో యీనాడున్న కులాలు, మతాలు, సంప్రదాయాలు పరమట్రాష్ అని, మనిషిలో మానవత్వాన్ని బ్రతికించేదీ, ప్రేమతో పునీతంచేసేదీ, సంతోషంగా జీవింపచేసేదీ ఏదైనావుంటే అదే సత్సంప్రదాయం' అని నమ్మేస్థితికి నన్ను తీసుకురావడానికి రఘువీర్ పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించాడు. ఒకసారి నామెదడును, నాహృదయాన్ని చుట్టినతెరలు జారిపోగానే రఘువీర్ ప్రేమ ఎంతో ఆమోదయోగ్యమైనదిగా, యిన్నేళ్ళుగా నాకోసం వేచివున్న అతను నాకెంతో ప్రీతిపాత్రుడుగా అనిపించింది. నీకు చెప్పి, నీ ఆశీర్వాదం తీసుకుని, నీ సమక్షంలో పెళ్ళి చేసుకోవాలని ఎంతోకోరికగావున్నా దానితో మా వివాహానికిరాగల అడ్డంకుల్ని ఊహించి రహస్యంగా పెళ్ళి చేసుకున్నాము.

అమ్మా! జీవితం జీవించడానికేకాని ఆత్మహత్య చేసుకోవడానికికాదు అని నమ్మిన నేను నా జీవితానికి నాకుతోచిన పరిష్కారాన్ని చూపించుకున్నాను. యీపరిష్కారం మంచిది, నాకు సంతోషాన్ని కలిగిస్తుందనే ప్రగాఢమైన నమ్మికతో, నేను నీకు కలిగించిన వ్యధను మరిచి నన్ను క్షమించి మనసారా ఆశీర్వదిస్తావనే పూర్తి విశ్వాసంతో..."

వైదేహి కళ్ళు సంతోషంతో వర్షిస్తున్నాయి.